

బెల్లంపల్లి : టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య, నాయకులు



ఆసిఫాబాద్ : బీఆర్ఎస్ భవన్‌లో జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం నాయకులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మంచిర్యాల అర్బన్ : రామగుండం కమిషనరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ



సీసీసీ నస్పూర్ : నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు



ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

# అవతరణోత్సవం

**మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

- ఆయా చోట్ల జాతీయ జెండాలను ఎగురవేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్
- పాల్గొన్న కలెక్టర్లు, ఎస్పీ, సీపీ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీ
- తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు.. అమరవీరులకు ఘన నివాళి
- ప్రధాన చౌరస్తాల్లో ర్యాలీలు.. జై తెలంగాణ నినాదాల హోరు
- ఆరు గ్యారెంటీలు అమలు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించిన బీఆర్ఎస్

నస్పూర్, జూన్ 2 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో సంబురాలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై వివరించారు. కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే వినోద్, ఎంపీ వంశీకృష్ణ పాల్గొన్నారు. మంచిర్యాలలోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే పీఎస్సార్ జెండా ఎగురవేశారు. నస్పూర్‌లోని మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తన నివాసం వద్ద జాతీయ జెండా ఎగురవేశారు. ఆయాచోట్ల తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. అమరవీరులకు నివాళులర్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రేణులు ప్లకార్డులు ప్రదర్శించాయి. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని కొనియాడారు. బెల్లంపల్లి పాత బస్టాండ్ ఏరియాలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పూలమాల వేశారు. టీబీజీకేఎస్ కార్యాలయం ముందు జెండా ఎగురవేశారు. రామగుండం కమిషనరేట్ ఆవరణలో సీపీ అంబర్ కిషోర్ ఝూ జాతీయ జెండా ఆవిష్కరించారు.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..**

ఆసిఫాబాద్ టౌన్/అంబేద్కర్ చౌక్, జూన్ 2 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అధ్యక్షతన నిర్వహించిన వేడుకలకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా చిల్డ్రన్ పార్క్‌లో అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ జెండా ఆవిష్కరించారు. 18 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీశ్ బాబు, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక సారథి బృందం పాటలతో అలరించారు. బీఆర్ఎస్ భవనం, క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి జాతీయ జెండా ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులర్పించారు. అంతకు ముందు బస్టాండ్ సమీపంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి, కుమ్రం భీం విగ్రహానికి పూలమాలలు వేశారు. కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఆయన చొరవతోనే ఆసిఫాబాద్ జిల్లాగా ఏర్పడిందని గుర్తు చేశారు. కాగా, సింగరేణి గనులపైనా వేడుకలు అంబరాన్నంటాయి.



సీసీసీ నస్పూర్ : నస్పూర్ కాలనీలో నిర్వహించిన ర్యాలీలో బతుకమ్మలతో వస్తున్న మహిళలు



కాగజ్‌నగర్ : జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

## సమగ్ర అభివృద్ధి దిశగా తెలంగాణ

*- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్*

*తెలంగాణ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి దిశగా సాగుతున్నది. నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తున్నాం. అర్హులైన వారికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కోటి మంది మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేశాం. 73 వేల కుటుంబాలకు రూ. 500లకు వంట గ్యాస్ అందిస్తున్నాం. 72 వేల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నాం. జిల్లాలో మొదటి విడుతలో 1669, రెండో విడుతలో 4410 ఇండ్లు మంజూరు చేశాం. మూడు మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. 51 వేల రైతులకు రుణాలు మాఫీ చేశాం. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణ అని చెప్పడానికి గర్వంగా ఉంది. కుల గణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించాం. అధికారుల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నాం.*



చెన్నూర్ : తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

*- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు*

*తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నది. ఆడబిడ్డల కోసం మహాలక్ష్మి పథకం తీసుకొచ్చి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది. సబ్సిడీ వంట గ్యాస్, కల్యాణలక్ష్మి అందిస్తున్నది. మంచిర్యాల జిల్లాలో 64,452 మంది రైతులకు రుణమాఫీ చేసింది. నిరుపేదల ఆకలి తీర్చడానికి జిల్లాలో 2,20,055 మందికి రేషన్ బియ్యం అందిస్తున్నది. కుల గణన నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తుంది. రాజీవ్ యువ వికాసం కింద పేదలకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నది. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తున్నది. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు రూ. 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నది. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నది. గ్రామాలు, మున్సిపాలిటీలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నది.*



మంచిర్యాలటౌన్ : అమరవీరుల స్తూపం దగ్గర ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని ప్లకార్డులను ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శ్రీరాంపూర్ : జీఎం ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

# కాంగ్రెసోళ్లు కొట్టుకున్నరు

**● మందమర్రిలో డ్రైనేజీ నిర్మాణంపై వాగ్వాదం ● ఒకరిపై ఒకరు చేయిచేసుకున్న నాయకులు ● తారాస్థాయికి వర్గ విభేదాలు**



మందమర్రి, జూన్ 2 : మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఇద్దరు కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. మాటా మాటా పెరగడంతో ఒకరిపై మరొకరు చేయి చేసుసుకోవడం చర్చనీయాంశమవుతున్నది. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని రామన్ కాలనీ నుంచి పాత బస్టాండ్ వరకు ఇటీవల చేపట్టిన భారీ డ్రైనేజీ నిర్మాణంలో లోపాలు చోటు చేసుకున్నాయని, డ్రైనేజీలో ఎత్తువంపులు ఉండడంతో మురుగు నీటితో పాటు వర్షపు నీరు దుకాణాల ఎదుట నిలుస్తోందని, అధికారుల పర్యవేక్షణ సైతం కొరవడిందని ఇది వరకే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతుండగా, అక్కడే ఉన్న కాంట్రాక్టర్(కాంగ్రెస్ నాయకుడు) జోక్యం చేసుకోవడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఒకరిపై ఒకరు చేయి చేసుకోగా, అక్కడే ఉన్న మరో నాయకుడు ఇద్దరిని సమాధాన పరిచి బయటకు పంపించడంతో గొడవ సద్దుమణిగింది. ఈ ఇద్దరు నాయకుల పంచాయతీని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌కు నివేదించేందుకు పలువురు నాయకులు వెళ్లినట్లు సమాచారం. నాయకుల మధ్య జరిగిన గొడవపై ఎమ్మెల్యే ఎలా స్పందిస్తారనేది వేచిచూడాలి. కాగా, ఇప్పటికే నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల మధ్య వర్గ విభేదాలు తారాస్థాయికి చేరగా, ఇటీవల స్థానిక కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు ఒకరిపై ఒకరు ప్రెస్‌మీట్‌లు పెట్టుకొని మరీ తీవ్ర ఆరోపణలు చేసుకోవడంపై ఆ పార్టీలో గందరగోళం నెలకొంది.

# గజేంద్రుడొస్తున్నాడు జాగ్రత్త..!

- గడ్చిరోలి నుంచి రాజూరా సమీపంలోకి రెండు ఏనుగులు
- రాత్రిపూట చేలవైపు వెళ్లొద్దని హెచ్చరిక



కౌటాల, జూన్ 2 : మహారాష్ట్ర నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామాల్లోకి ఏనుగులు వచ్చే అవకాశమున్నదని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నుంచి రెండు ఏనుగులు చంద్రపూర్ జిల్లా రాజూరా సమీపంలోకి వచ్చినట్లు గుర్తించిన అధికారులు, అటవీ సమీప గ్రామాల ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలంటూ సూచిస్తున్నారు. సోమవారం సిర్పూర్ టీ, చింతలమానేపల్లి, కౌటాల మండలాల సరిహద్దు గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రిపూట తోటలు, చేల వైపు వెళ్లకూడదని సూచించారు. గతంలో ఓ ఏనుగు చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్ మండలాల్లో కలియదిరిగి ఇద్దరిపై దాడి చేసి చంపిన విషయం విదితమే. ఏనుగులు మళ్లీ వస్తున్నట్లు ప్రచారమవుతుండడంతో ఆయా ప్రాంతాల ప్రజల్లో వణుకుపుడుతున్నది.

# ట్రినిటీ విజయభేరి

కరీంనగర్ హౌసింగ్ బోర్డుకాలనీ, జూన్ 2: జేఈఈ– అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు విజయభేరీ మోగించారు. ఏ రఘుపతి జాతీయ స్థాయిలో 40వ ర్యాంకు, ఎం నిఖిత్ నాయక్ 194, డీ మహేశ్ 225, ఏ రఘుపతి 226, బీ సిద్ధిక 1107, సీహెచ్ ఐశ్వర్య 1129, బీ ఠాగూర్ 1274, ఆర్ నవదీప్ 1701, కే నిస్సి జాస్పర్ 2172, జీ అజయ్ 3077, కే అక్షర 4524వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని, ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్పష్టమైన ప్రణాళిక, మెరుగైన విద్యాబోధన, నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఈ ర్యాంకులు సాధ్యమయ్యాయని హర్షం వ్యక్తం చేశారు. ఎస్సెస్సీ ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తమ కళాశాలలో ఫీజు రాయితీ ఇస్తున్నామని చెప్పారు. ఈ సంవత్సరం నుంచి ఐఐటీ– అడ్వాన్స్‌డ్ లాంగ్ టార్మ్ ప్రారంభించబోతున్నామని తెలిపారు. రాబోయే టీఎస్ నీట్ ఫలితాల్లోనూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల అభినందన సభలో పాల్గొన్న విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఉత్తమ విద్యకు ట్రినిటీ కళాశాలలు మారుపేరని, ఉత్తమ ర్యాంకుల సాధన కేవలం తమ కళాశాలలకే సాధ్యమని చెప్పారు.




విద్యార్థినులను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల ఫౌండర్ మనోహర్ రెడ్డి